ఐటీ కోర్ టీంకు ఎన్‌సీఆర్‌బీ అవార్డు



సుకుమార్ బాబుకు అవార్డు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు అత్యంత ఉపయుక్తమైన క్రైం క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్ వర్కింగ్ సిస్టం (సీసీటీఎన్ఎస్), ఇంటరాపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం(ఐసీజేఎస్) అప్లికేషన్‌లను సమర్థవంతంగా వినియోగించుకుంటున్న జిల్లా ఐటీ కోర్ టీంకు అవార్డు దక్కింది. నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇచ్చిన అవార్డును ఐటీ కోర్ టీం హెడ్ కానిస్టేబుల్ సుకుమార్ బాబుకు ఎస్పీ జగదీష్ శుక్రవారం అందజేశారు. ఐటీ అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవడం, డాటా ఎంట్రీ పక్కాగా నిర్వహించే వారికి రాష్ట్రవ్యాప్తంగా రెండు అవార్డులను ఎన్‌సీఆర్‌బీ వారు ఇస్తుంటారు. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ, ఆ పై అధికారుల వరకు అవార్డులు ఇస్తుంటారు.

బడిలో ఊడిపడ్డ పెచ్చులు

ఆరో తరగతి విద్యార్థినికి గాయాలు



అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడిపడి ఆరో తరగతి విద్యార్థిని మానసకు తీవ్ర గాయమైంది. విద్యార్థిని శుక్రవారం మధ్యాహ్న భోజనం తిన్న తరువాత తరగతికి వెళుతుండగా వరండాలో పెచ్చులు ఊడి తలపై పడ్డాయి. బాలికను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. తలమీద లోతైన గాయం కావడంతో కుట్లు వేశారు. గుత్తి ప్రాంతానికి చెందిన బాధిత బాలిక స్థానికంగా ఓ ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటోంది. బాలిక తీవ్రంగా గాయపడినా అధికారులు గోప్యంగా ఉంచారు. కేఎస్సార్‌లో 10వ తరగతి పరీక్షల క్యాంపు నిర్వహిస్తున్నారు. పరీక్షల హడావుడి మొదలైంది. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు తరచూ వెళుతుంటారు. అప్పుడప్పుడు అబ్జర్వర్, ఆర్జేడీ వంటి రాష్ట్ర స్థాయి అధికారులు కూడా వస్తుంటారు. శిథిలావస్థలో ఉన్న భవంతి గురించి ఎవరూ ఆలోచించడం లేదు.

ఇండోర్ స్టేడియానికి వైసీపీ గ్రహణం..!

నిర్మాణంపై ఐదేళ్లూ నిర్లక్ష్యం

ముందుకు కదలని పనులు

క్రీడాకారుల ఆశలపై నీళ్లు

కల్లూరులో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం



గార్లదిన్నె, మార్చి 7(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ఆశలపై గత వైసీపీ పాలకులు నీళ్లు చల్లారు. మండలంలోని కల్లూరు వాసులు పోరాటాల ద్వారా సాధించుకున్న ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని అటకెక్కించారు. ఐదేళ్లూ ఆ వైపు కూడా చూడలేదు. స్టేడియం స్థలాన్ని రియల్టర్లు కబ్జా చేసే పరిస్థితి వచ్చిందంటే వైసీపీ ఏస్థాయిలో నిర్లక్ష్యం వహించిందో అర్థం చేసుకోవచ్చు. స్టేడియంలో కంపచెట్లు పెరిగిపోయాయి.

టీడీపీ హయాంలో ప్రారంభం

పారిశ్రామిక వాడగా కల్లూరు పేరుగాంచింది. పంచాయతీలో సుమారు 20వేల జనాభా ఉంది. క్రీడాకారులు, వివిధ ఉద్యోగాల ప్రయత్నంలో ఉన్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు వ్యాయామాలు, వాకింగ్ చేసుకునేందుకు గ్రామంలో స్టేడియం లేదు. దీంతో వారందరూ 44వ జాతీయ రహదారిపైకి వెళ్తుంటారు. రహదారిపై వాహనాలు అతివేగంతో వస్తుండడంతో భయంభయంగా వెళ్తుంటారు. గతంలో పలువురు ప్రమాదాల బారిన పడ్డారు కూడా. ఈ నేపథ్యంలో గ్రామంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. స్టేడియం కోసం క్రీడాకారులు గతంలో నిరహార దీక్షలు చేపట్టారు. స్పందించిన తెలుగుదేశం ప్రభుత్వం 2018లో కల్లూరులో స్టేడియం నిర్మాణానికి ఉపక్రమించింది. కొండకింద కొట్టాల సమీపంలో స్థలాన్ని కేటాయించింది. స్టేట్ డెవలప్‌మెంట్ ద్వారా సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పట్లో ఇండోర్ స్టేడియం పనులను ప్రారంభించి, 30 శాతం పూర్తి చేశారు.

వైసీపీ నిర్లక్ష్యం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని అటకెక్కించింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఐదేళ్లు అటువైపు కూడా చూడలేదు. స్టేడియంలో కంపచెట్లు పెరిగిపోయాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు రియల్టర్లు.. స్టేడియం స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు.

కూటమిపై ఆశలు

గతేడాది కూటమి అధికారంలోకి రావడంతో క్రీడాకారుల్లో ఆశలు రేగాయి. ఇండోర్ స్టేడియానికి మోక్షం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులు, అధికారులు స్పందించి, ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రోత్సహించాలి. కల్లూరులో చాలామంది క్రీడాకారులున్నారు. స్థానికంగా స్టేడియం లేక పామిడి, అనంతపురానికి వెళ్తున్నారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తే స్థానికంగానే క్రీడలు ఆడుకోవచ్చు.

\- చాంద్‌బాషా, కల్లూరు

సరిహద్దు రాళ్ల తొలగింపు

అనధికార లే అవుట్లపై అహుడా కొరడా



లే అవుట్లలో రాళ్లను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని అనధికార లే అవుట్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్మన్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశాలతో ఏర్పాటైన రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రంగంలోకి దిగాయి. పంచాయతీ అధికారులను సమన్వయం చేసుకుని అక్రమ లే అవుట్లపై చర్యలకు దిగాయి. కందుకూరు ఎంజీజీ లే అవుట్ తూర్పు, దక్షిణం వైపు వేసిన అక్రమ లే అవుట్‌లో పాతిన రాళ్లను, ఫెన్సింగ్‌ను, ప్రహరీని అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున శుక్రవారం తొలగించారు. వెంటనే అహుడా అనుమతులు పొందాలని అక్రమ లే అవుట్లు వేసిన ఎస్‌వీఆర్ఎస్, హెచ్‌జే ఇన్‌ఫ్రా యజమానులకు నోటీసులు జారీ చేశారు. అనుమతి లేని లే అవుట్లను తొలగించి, భారీ జరిమానాలు వేస్తామని వారు హెచ్చరించారు. అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లను రిజిస్టర్ చేయవద్దని సబ్ రిజిస్ట్రార్లకు అహుడా తరఫున లేఖలు పంపుతామని, ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

పెట్రోలు బంకుల్లో జాగ్రత్త

కొలతల్లో తేడా అనిపిస్తే ఫిర్యాదు చేయండి

విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్



టాంపరింగ్ చిప్‌ను చూపుతున్న విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్

అనంతపురం న్యూటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ వేయించుకునే సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ సూచించారు. స్థానిక బళ్లారి రోడ్డులోని విజయ ఫిల్లింగ్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెట్రోలు బంకుల్లో అక్రమాలపై ఆయన వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 8 పెట్రోలు బంకుల్లో తనిఖీలు చేశామన్నారు. మూడు బంకుల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయన్నారు. సోములదొడ్డిలోని జయలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్‌లోని డిస్పెన్సింగ్ యూనిట్ (డీయూ) పైభాగంలోని డిస్‌ప్లే బోర్డులో చిప్‌ను అమర్చారన్నారు. మదర్‌బోర్డును ట్యాంపర్ చేసి, ప్రత్యేకంగా ప్రోగ్రామింగ్ చేసిన చిప్‌ను ఏర్పాటు చేశారన్నారు. సనప, అనంతపురంలోని విజయ ఫిల్లింగ్ స్టేషన్‌లో సైతం ఇదే తరహా మోసాలు వెలుగు చూశాయన్నారు. ఇలా టాంపరింగ్ చేయడం ద్వారా ప్రతి లీటరు పెట్రోలు, డీజిల్‌కు 60 మి.లీ. నుంచి 100 మి.లీ. దాకా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన వివరించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం వస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, విజిలెన్స్ సీఐలు శ్రీనివాసులు, జమాల్‌బాషా, సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్ పాల్గొన్నారు.

హంద్రీనీవా వెడల్పుతోనే సీమకు ప్రయోజనం

లైనింగ్ చేశాక.. వెడల్పు అసాధ్యం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తేనే రాయలసీమకు ప్రయోజనం చేకూరుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సీమ ప్రజాప్రతినిధులు.. అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరు తీసుకెళ్లాలంటే హంద్రీనీవా ఒక్కటే మార్గమన్నారు. కాలువ ద్వారా 70 నుంచి 80 టీఎంసీల నీరు తీసుకురావాలంటే వెడల్పు చేయాల్సిందేనన్నారు. మొదటి దశలో 3,850 క్యూసెక్కులకు చేస్తామనీ, రెండో దశలో లైనింగ్ చేస్తామనడం సరికాదన్నారు. మొదటి దశలో 10 వేల క్యూసెక్కులకు చేయాలన్నారు. దీనిపై సీమ ప్రజాప్రతినిధులంతా సీఎం చంద్రబాబుతో మాట్లాడాలని సూచించారు. లైనింగ్ పనులు చేస్తే ఏ ప్రభుత్వం వచ్చినా మళ్లీ వెడల్పు చేయడం కుదరదని ఆయన వివరించారు.

ఫీజు పోరును విజయవంతం చేయాలి

వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన తలపెట్టిన ఫీజుపోరును విజయవంతం చేయాలని అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. 12న జడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపడతామన్నారు.



ఉష్ణోగ్రతలు

శుక్రవారం

గరిష్ఠం	38.0
కనిష్ఠం	19.0



ఇఫ్తార్	సెహరీ
6.30	5.16
శుక్రవారం సాయంత్రం	శనివారం ఉదయం





విజయపథంలో మహిళాదీప్తి

అవకాశాలను సృష్టించుకుంటూ, అద్భుతాలు సాధిస్తూ..
స్ఫూర్తి, ప్రేరణ కలిగేలా మగువల జైత్రయాత్ర
నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

మారుతున్న కాలానికి తగ్గట్లుగా మగువలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ, అద్భుతాలు సాధిస్తున్నారు. కష్టాలు, నష్టాలను దాటి ప్రగతి మార్గంలో సాగిపోతున్నారు. ఇంటిని చక్కబెడుతూనే సమాజాన్ని సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. లింగ బేధం శరీరానికే కానీ మనసుకు, సాధించాలనే తపనకు కాదని లోకానికి తమ విజయాల ద్వారా చాటి చెబుతున్నారు. వారి ఆకాంక్షలు నెరవేర్చడానికి ఆధునిక ప్రభుత్వాలు చేయూతనిస్తుడటంతో అవనిపైనే కాదు ఆకాశమార్గంలో సైతం పురుషులకు ధీటుగా ఒక్కోసారి మేటిగా రాణిస్తున్నారు. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం. ఆ సందర్భంగా గిరి శిఖరం చేరిన కొందరి మహిళల విజయగాథలు వారి మాటల్లోనే...

శిఖరాగ్రంపై ఆమె

పది మందికి ఉపాధి కల్పించాలని..


నాగలక్ష్మి

నేను చదువుకుంది పదోతరగతే. అయినా పది మందికి ఉపాధి కల్పించాలన్నదే నా కోరిక. ఆదిశగా ప్రయత్నం చేశా. ఆ క్రమంలోనే పదేళ్ల కిందట నుంచి రంగు రంగుల ప్లాస్టిక్ పూలహారాలు తయారుచేసి విక్రయించడం ప్రారంభించా. దీని ద్వారా అప్పట్లో 5నుంచి 10మందికి మాత్రమే ఉపాధి కల్పించేది. కాని ఐదేళ్ల కిందట రబ్బర్, ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి, వస్త్రంతో పూలహారాలలను తయారు చేయడం ప్రారంభించా. దీంతో వ్యాపారం లావాదేవీలు పెరిగాయి. దీంతో వివిధ మార్గాల ద్వారా డబ్బు సమకూర్చుకుని అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేసుకుని పూలహారాలు తయారు చేయడం ప్రారంభించాం. ఈ నేపథ్యంలో సుమారు 300మంది దాకా ఉపాధి కల్పించగలిగా. మేము తయారు చేసే డెకరేషన్ పూలహారాలు ఆంధ్రతోపాటు తెలంగాణ, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్‌గా విక్రయిస్తాం. సుమారు వంద రకాల హారాలను తయారు చేస్తాం. మేము రూ.40నుంచి రూ.5వేల దాకా విలువ గల హారాలను తయారు చేస్తున్నాం. ఏడాదికి రూ.3కోట్ల దాకా టర్నోవర్ ఉంటోంది. మేము తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల నుంచి అవసరమైన వస్త్రం తెప్పిస్తున్నాం. మరికొంత ముడిసరుకు తీసుకొస్తున్నాం. త్వరలో ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు ప్రారంభిస్తాం. రాష్ట్రంలో వంద మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రభుత్వం ఎంపిక చేయగా అందులో నాకు స్థానం దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకుంటా.

-నాగలక్ష్మి, పూలహారాల తయారీ ఫ్యాక్టరీ యజమాని


మహిళలు వస్త్రంతో తయారు చేసిన పూల హారాలు

విన్సెంట్ ఫెర్రర్ ప్రేరణతో..



విన్సెంట్‌ఫెర్రర్‌ను కలవడం నా జీవితంలో గొప్ప మలుపు తీసుకుంది. 1972లో అనంతపురంలోని ఆర్డీటీని సందర్శించా. అక్కడ ఫెర్రర్‌తో మాట్లాడిన తర్వాత నాలో ఓ ప్రేరణ కలిగింది. సామాజిక సేవపై ఆసక్తి ఏర్పడింది. ఈక్రమంలోనే దాదాపు 12ఏళ్ల పాటు వివిధ సంస్థలతో పాటు జిల్లాలోని యంగ్‌ఇండియా సంస్థలో కూడా పని చేశా. మాది కేరళ రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా. నేను సోషల్ వర్క్‌లో పీజీ చేశా. సామాజిక సేవపై అభిలాషతో వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరికి చెన్నేకొత్తపల్లి మండలంలో స్థిరపడ్డా. ఆ మండలంలోని కరువు పరిస్థితులు, మహిళలు, రైతుల స్థితిగతులను గమనించా. వారిలో మార్పు తీసుకురావడానికి 1990లో టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థను నెలకొల్పా. సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణ, మహిళాసాధికారత, సుస్థిర వ్యవసాయం, విద్య, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం సంస్థ ద్వారా చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం, పెనుకొండ తదితర మండలాల్లో సొసైటీలను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం 34 వేల మంది మహిళలతో రూ.65కోట్ల టర్నోవర్‌తో అది మహాశక్తిగా నడిస్తోంది. మహిళలు ఎంచుకున్న రంగంలో దృఢ సంకల్పంతో ముందుకు సాగితే తప్పక విజయం సాధిస్తారు.

- మేరీ వటమట్టం, టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకురాలు


ఉన్నత చదువులే తోడు.. నీడ (సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినులు)

ఇంటి నుంచే మార్పు



మహిళల మార్పు ఇంటి నుంచే మొదలుపెట్టాలి. తనపిల్లలను లింగవివక్షలేకుండా మంచి క్రమశిక్షణతో పెంచాలి. మంచి చదువు, సంస్కారం నేర్పాలి. సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలి. ఇళ్లే ప్రథమపాఠశాల కాబట్టి పిల్లలకు చిన్నతనం నుంచే పెద్దలపట్ల గౌరవభావం పెంపొందేలా తీర్చితిద్దాలి. బాలికల అభిరుచిని గమనించి వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి. సమాజంపట్ల బాధ్యతను చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇదంతా తల్లి వల్లే సాధ్యం అవుతుంది.

- డాక్టర్ ఫైరోజ్‌బేగం, డీఎంహెచ్‌ఓ, శ్రీసత్యసాయి జిల్లా

సంఘాలతో మహిళా సాధికారత



స్వయం సహాయక సంఘాలతో మహిళా సాధికార సాధ్యమవు తుంది. వీటి ద్వారా మహిళకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతోంది. డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు. డ్వాక్రా సంఘాలు వచ్చిన తరువాతే మహిళల్లో చదువు, సమాజం పట్ల అవగాహన పెరిగింది. ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి, జీవనోపాధులు పెంపొందించుకోవడానికి, ఆత్మ విశ్వాసానికి సంఘాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

- సుశీల, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

చైతన్యం పెరిగింది



డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా చేరడంతో మహిళల్లో చైతన్యం పెరిగింది. సమాజంలో లింగబేధం లేకుండా పురుషులు, మహిళలు అందరూ సమానమేననే భావన ప్రజల్లో మొదలైంది. డ్వాక్రా సంఘాలతోనే మూఢనమ్మకాలు, దాడులను నియంత్రించే స్థాయికి మహిళలు వచ్చారు. ఇదంతా కేవలం డ్వాక్రా సంఘాలతోనే సాధ్యమైంది. ఎస్‌హెచ్‌జీ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు, ఉన్నతి కింద జీవనోపాధుల పెంపునకు రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలు స్వయం ఉపాధిని పొందుతున్నారు

- రాధమ్మ, ప్రశాంతి సమాఖ్య జిల్లా కార్యదర్శి

50 శాతం సీట్లు కేటాయించాలి

తనకల్లు, మార్చి7 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళలకు 50శాతం సీట్లు కేటాయించాలి. నన్ను చిన్నప్పటినుంచి మా తల్లిదండ్రులు ఎలాంటి వివక్ష లేకుండా పెంచారు. వారి ప్రోత్సాహంతోనే ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించా. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, సంఘసంస్కర్తలు, ప్రభుత్వాలు మహిళ చైతన్యం కోసం పనిచేస్తున్నా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో కొన్నిచోట్ల మహిళల పట్ల వివక్ష కొనసాగుతోంది. అది పూర్తిగా రూపుమాపాలి.

- ఎస్ లలితమ్మ, ఎంఈఓ, తనకల్లు



విరామం తర్వాత గెలుపుతో స్ఫూర్తి: ప్రభావతి, యోగా శిక్షకురాలు

పెళ్లై పిల్లలు కలిగినా జీవితంలో ఏదో తెలియని వెలితి. ఏదో సాధించాలన్న తపన. ఇవే నన్ను యోగా వైపు నడిపించాయి. చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే ఎంతో ఇష్టం. ఈక్రమంలోనే రన్నింగ్, త్రోబాల్, వాలీబాల్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రోలలో ఎన్నో బహుమతులు సాధించా. 800 మీటర్ల హర్డిల్స్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని అందుకున్నా. ఇలా నా ఆటలు డిగ్రీ వరకూ సాగాయి. ఆపై స్తోమతలేక మా నాన్న నన్ను చదివించలేకపోయారు. దీంతో ఉన్నత చదువులు, క్రీడలు రెండింటికి దూరమయ్యా. ఇదంతా 1995 నాటి మాట. పెళ్లైన తర్వాత ముదిగుబ్బలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా చేరా. 2014లో మా పాఠశాల డైరెక్టర్ హెల్గా శాంతి పుట్టపర్తిలో యోగా తరగతులు నిర్వహించారు. వాటికి హాజరయ్యాక యోగాపై ఆసక్తి కలిగింది. అందులో ప్రావీణ్యం సాధించాలనే పట్టుదల కలిగింది. యోగా సాధన మొదలు పెట్టా. ఆపై తమిళనాడులోని మధురై శివానంద యూనివర్సిటీలో ఏడాది పాటు యోగలో ప్రత్యేక శిక్షణ చేశా. యోగాలో కఠినమైన సూత్రనేతి, జలనేతి వంటి ఆసనాలపై శిక్షణ తీసుకొని, జల, వాయు, ప్రెగ్నెన్సీ, పిల్లల కోసం ఇలా రకరకాల అంశాల్లో మెలకువలు నేర్చుకున్నా. తరువాత ఎంఎస్సీ(యోగా) పూర్తి చేశా. ఆ తర్వాత ముదిగుబ్బలోనే ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా చేరా. విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తూనే, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఎన్నో పతకాలు గెలుచుకున్నా. విరామం అనంతరం వచ్చిన గెలుపు కదా.. మరిన్ని విజయాలు సాధించే స్ఫూర్తినిచ్చింది.


యోగాలో గెలుపొందిన పతకాలను చూపుతున్న ప్రభావతి

బోధించే అవకాశం రావడం ఆనందంగా ఉంది..

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతితో ఇంటర్వ్యూ



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ)గా పనిచేస్తున్న తనను బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా ఉందంటున్నారు సుమన జయంతి. బోధన తనకు ఇష్టమనీ, డీఎల్‌పీఓగా ఉంటే ఆ అవకాశం దక్కేది కాదన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు నియమించాక సబ్జెక్టు బోధించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందని చెబుతున్న ఆమెతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: పీఆర్ నుంచి బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చాక ఎలా ఉంది..?

జవాబు: పంచాయతీరాజ్ నుంచి బీసీ స్టడీ సర్కిల్‌కు రావడం ఆనందంగా ఉంది. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. నాకు ముందు నుంచీ టీచింగ్ అంటే ఇష్టం. బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్‌లను పర్యవేక్షించడం, అవసరమైనపుడల్లా సబ్జెక్టు బోధించే అవకాశం లభించినట్లయింది.

ప్రశ్న: స్టడీ సర్కిల్‌లో వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు : బీసీ స్టడీ సర్కిల్ భవనం అక్కడక్కడా దెబ్బతింది. వసతుల కల్పన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. ఇప్పటికే పలు అంశాలను అధికారులకు వివరించా.

ప్రశ్న: కోచింగ్‌కు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి వసతులు కల్పించాలనుకుంటున్నారు?

జవాబు: స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు వచ్చే అభ్యర్థులకు వసతుల కల్పన విషయంలో నిబంధనలు పాటిస్తాం. మెరుగైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: డీఎస్సీ మెటీరియల్ ఇవ్వకపోడంతో ఇబ్బందులు పడుతున్నారు.. ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: డీఎస్సీ మెటీరియల్ గతంలో ఇచ్చేవారని తెలిసింది. ప్రస్తుతం స్టైఫండ్‌తో పాటు మెటీరియల్‌కు సంబంధించి రూ.1000 జమ చేస్తారు. మెటీరియల్ పంపిణీ విషయాన్ని రాష్ట్ర అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఉచిత శిక్షణలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రాబోయే కాలంలో మొదలయ్యే అన్ని రకాల శిక్షణలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. ఉదయం 7.30 గంటల నుంచి కోచింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. తద్వారా విద్యార్థులకు మరింత సమయం కేటాయించినట్లవుతుంది.

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం మేరకు ఫలాలు అందాలి

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు కృషి

సమీక్షలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన ఫలాలను అందించడానికి అధికారులు కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అందరూ పనిచేయాలని సూచించారు. జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి భూములు లేని నిరుపేద కుటుంబాలకు భూమి ఇవ్వాలన్నారు. ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కృషిచేస్తానని తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన వివిధ కేసులలో బాధితులకు రూ.58 లక్షలు పరిహారం వచ్చిందని తెలిపారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడానికి పోలీస్ యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. విజిలెన్స్ కమిటీ సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, సోషల్ వెల్ఫేర్ డీడీ రాధికా, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బీసీఆర్ దాస్, యల్లన్న, చిరంజీవి, ఇమామ్, రామన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా, కలెక్టరు,ఎస్పీ

గ్రేడ్-3 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులపై కదలిక

210 మంది సీనియార్టీ జాబితా విడుదల

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించడం కోసం జిల్లా వైద్యశాఖ అడుగులు వేస్తోంది. ప్రభుత్వం ఆదేశించినా గత ఆరునెలలుగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పదోన్నతులపై వైద్యశాఖ నిర్లక్ష్యం' అంటూ కథనం ప్రచురితమయింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి పదోన్నతులు కల్పించడానికి సిద్ధమయ్యారు. ఉమ్మడి అనంత జిల్లాలో 1017 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 215 ఎంపీహెచ్ఏ(ఎఫ్) పోస్టులు ఖాళీలుగా చూపారు. ఇందులో సత్యసాయి జిల్లాలో 111 ఉండగా అనంత జిల్లాలో 114 ఉన్నాయి. ఐదు కోర్టు కేసులు ఉండడంతో వాటిని పక్కన పెట్టారు. మిగిలిన 210 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. ఆ మేరకు అర్హతగల సీనియార్టీ జాబితాను తయారు చేసి వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. ఈనెల 10లోగా పీహెచ్, వితంతువు, అంధులు తదితర ప్రిఫరెన్సియల్ ఉన్నవారు సర్టిఫికెట్లను సమర్పించాలని తెలిపారు. వాటిని పరిశీలించి అందులో అర్హత ఉంటే పదోన్నతుల కౌన్సిలింగ్‌లో ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ఈనెల 15వ తేదీ లోగా పదోన్నతుల ప్రక్రియ ముగిస్తామని అన్నారు.

ఎన్నికల కేసులపై చార్జిషీట్ వేయండి

ఎస్పీకి సూచించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల అనంతరం జిల్లాలో చోటు చేసుకున్న అల్లర్లు, హింసకు సంబంధించిన కేసులపై వెంటనే చార్జిషీట్ వేయాలని ఎస్పీ జగదీష్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం జరిగిన హింస చాలా సున్నితమైన అంశం అన్నారు. హింసకు సంబంధించిన కేసులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తాడిపత్రిలో ఏడు కేసులు నమోదు కాగా అందులో ఐదు కేసులకు సంబంధించి చార్జిషీట్ వేశామని, ఒకటి తప్పుడు కేసుగా తేల్చగా, మరో కేసుపై విచారణ కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేయడంలో పోలీస్‌శాఖకు సంపూర్ణసహకారం అందించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎన్నికల అల్లర్లకు చెందిన కేసులపై కఠింగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని కేసులకు వెంటనే చార్జిషీట్స్ వేయాలని ఆయా పరిధిలోని కిందిస్థాయి పోలీసు అధికారులను ఆదేశించారు.

11న పెనుకొండలో జాబ్‌మేళా

పెనుకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ఈనెల 11న కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణఓ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ పూర్తిచేసి 18-33 సంవత్సరాలలోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.18వేల దాకా జీతం ఉంటుందన్నారు. ఎంపికైన వారు పాలసముద్రం, పెనుకొండ, హిందూపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని 11న ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాలన్నారు. ఇతర వివరాలకు 9676706976కు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్‌ను సంప్రదించాలన్నారు.

ఆవుకు కృతిమ కాలు ఏర్పాటు


ఆవుకు అమర్చిన కృతిమ కాలుతో లింబ సెంటర్ సిబ్బంది

గుంతకల్లు టౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలోని గోశాలలో ఓ ఆవుకు కృతిమ కాలును శుక్రవారం అమర్చారు. బళ్లారిలోని శ్రీ షిరిడి సాయి సేవా సత్సంగ్ సహకారంతో హుబ్లీకి చెందిన మహావీర్ లింబ సెంటర్ సిబ్బంది ఆవుకు కృతిమ కాలును అమర్చారు. కార్యక్రమంలో శ్రీ షిరిడీ సాయిసేవా సత్సంగ్ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్యాయత్నం

యాడికి, మార్చి7(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనివ్వలేదని గంజి మహేంద్ర (16) విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం మండలంలోని నిట్టూరు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు నిట్టూరు గ్రామానికి చెందిన మహేంద్ర తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లి మీనాక్షిని అడుగుతుండేవాడు. ఇప్పుడు నీకు సెల్‌ఫోన్ ఎందుకు అని తల్లి మందలించింది. సెల్‌ఫోన్ అడిగినా కొనివ్వలేదని మనస్తాపంతో మహేంద్ర విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు తెలిపారు.

ప్రేరణ సఖిగా జ్యోతమ్మ

ధర్మవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలోని సాయినగర్ శారదాంబ మహిళా పొదుపు సంఘం సభ్యురాలు జ్యోతమ్మ.. ప్రేరణ సఖి అవార్డుకు ఎంపికయ్యారని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జ్యోతమ్మ తోలుబొమ్మల తయారీ రంగంలో, పారిశ్రామిక వేత్తగా రాణిస్తున్నారు. దీంతో ఆమె.. ప్రేరణ సఖిగా ఎంపికైందన్నారు. పుట్టపర్తిలో శనివారం నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

పోలీసు స్టేషన్లకు సెట్-2 ప్రశ్నాపత్రాలు

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చేరిన పదో తరగతి సెట్-2 ప్రశ్నాపత్రాలను వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు(సెట్-2) ప్రత్యేక వాహనంలో చేరాయి. వాటిని పోలీసు స్టేషన్లలో భద్రపరిచారు.

135 అభ్యంతరాలు...

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై శుక్రవారం 135 అభ్యంతరాలు వచ్చాయి. సైన్స్ సెంటర్‌కు టీచర్లు రోజురోజుకీ క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకూ అభ్యంతరాల సంఖ్య 361కి చేరింది.

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలువను వెడల్పు చేయడంతోపాటు పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని రైతులు కోరుతుంటే లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదన్నారు. హంద్రీనీవాను వెడల్పు చేయకుండా అత్యంత వెనుకబడిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. సీమ అభివృద్ధికి సాగు నీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే హంద్రీనీవాకు నీరు వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు చేస్తామని టెండర్లు పిలిచారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 6300 క్యూసెక్కులకంటే ఎక్కువ నీరు తెస్తామని ఎన్నికల ముందు చెప్పారన్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన టెండర్లలో 3850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండో దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధమవడం ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఉందని విమర్శించారు. లైనింగ్ పనులను రాప్తాడు ఎమ్మెల్యే కూడా వ్యతిరేకిస్తున్నందున మిగిలిన ఎమ్మెల్యేలు వారి వైఖరులను ప్రకటించాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రితో సానుకూల నిర్ణయం ప్రకటింపజేయాలని కోరారు.

మరో ఇద్దరికి ఏఓలుగా ఉద్యోగోన్నతి


ఉత్తర్వులు అందుకుంటున్న చంద్రశేఖర్

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓ)గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవలి వరకూ నాలుగు ఏఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. రెండ్రోజుల క్రితం ముగ్గురికి ఉద్యోగోన్నతి ఇచ్చి, భర్తీ చేశారు. అందులో ఒకరు తనకు ఏఓ ఉద్యోగోన్నతి వద్దని... లిఖితపూర్వకంగా రాసి అధికారులకు ఇవ్వడంతో ఆ పోస్టు ఖాళీ పడింది. అప్పటికే ఖాళీ ఉన్న మరొకటి కలిపి రెండు పోస్టులకు ప్యానల్ సీనియారిటీ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌కు ప్రమోషన్ ఇస్తూ... నంబులపూలకుంట మండల పరిషత్ కార్యాలయానికి నియమించారు. మరో సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్‌కు సైతం ప్రమోషన్ ఇస్తూ అగళి మండల పరిషత్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగా ప్రమోషన్ పొందిన ఏఓలకు జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో

ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష

అనంతపురం క్రైం, మార్చి7(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయి రమావత్ డాక్యా నాయక్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. 2019 మే 17వ తేదీన వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన డాక్యానాయక్ పదేళ్ల బాలికను అపహరించాడు. పొలంలోని చింతచెట్టు వద్దకు ఎత్తుకెళ్లి, తన పంచెతో బాలిక కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి వజ్రకరూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. అప్పటి గుంతకల్లు డీఎస్పీ ఖాసీంసాబ్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో శుక్రవారం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ జగదీశ్ అభినందించారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాల పెంపు

మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల కన్వీనర్ జోనాథన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తులు వస్తుండడంతో ఏడు పరీక్షా కేంద్రాలను పెంచుతున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనాథన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, పెంచిన పరీక్షా కేంద్రాలను విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

పెంచిన పరీక్ష కేంద్రాలు..

కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం, అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న శింగనమల ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసత గృహం, అనంతపురంలోని బాయ్స్ జూనియర్ కళాశాలలోని ఉన్న బీసీ నార్పల బాలుర కళాశాల వసతిగృహం, అనంతపురం హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డులో ఉన్న నార్పల బీసీ కళాశాల బాలికల వసతి గృహం, రాయదుర్గంలోని బీసీ బాలుర వసతిగృహం, అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రి వెనుకవైపు ఉన్న బీసీ బాలికల కళాశాల వసతిగృహం, ధర్మవరంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాలు పెంచిన పరీక్షా కేంద్రాల జాబితాలో ఉన్నాయి.

మట్టే కదా..!

- జిల్లాలో చెలరేగిన మట్టి మాఫియా
- కొండలు పిండి.. చెరువులు ఖాళీ..
- సొమ్ము చేసుకుంటున్న స్వార్థపరులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు, మైన్స్, ఇరిగేషన్ శాఖలు


దేవరపల్లిలోని కొండను తవ్వేసిన మట్టి మాఫియా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రోడ్లకు, పొలాలకు ఇష్టానుసారంగా మట్టిని తరలించేస్తున్నారు. ఇటీవల ఇప్పేరులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లను మైన్స్ అధికారులు అలా పట్టుకుని ఇలా వదిలేశారు. పామిడి మండలం దేవరపల్లి కొండల్లో, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పగటి పూట రైతుల పంట పొలాల పేరుతో మట్టిని తరలిస్తున్న మాఫియా...రాత్రి పూట అసలు దందా చేస్తోంది. ఇంత మట్టి దోపిడీ జరుగుతున్నా మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్లు ప్రేక్షకపాత్రలో మిన్నకుండిపోతున్నారు. ఆయా శాఖల మధ్య సమన్వయలోపమే మట్టి మాఫియా ఆగడాలకు కారణమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇప్పటికే పలు ఫిర్యాదులు వెళ్లినా వాటిని బుట్టదాఖలు చేస్తున్నట్లు సమాచారం.

దేవరపల్లి కొండ, ఇప్పేరు చెరువు మట్టి తరలింపు

పామిడి మండలం దేవరపల్లి వద్ద ఉన్న ఓ కొండను పిండి చేసేశారు. టిప్పర్ రూ.5వేలు చొప్పున రోజుకు 50 టిప్పర్లు తోలేస్తున్నారు. కొన్నిరోజులు పగలు, మరికొన్ని రోజులు రాత్రి పూట మట్టిని తోడేస్తున్నారు. కూడేరు మండలం ఇప్పేరు చెరువులో పొట్టిచెరువు గ్రామానికి చెందన ఓ చోటా నాయకుడు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో మైన్స్ అధికారులు ఇటీవల దాడి చేసి ఎక్స్‌కవేటర్, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. నామమాత్రపు జరిమానాతో ఆ వాహనాలను వదిలేశారు. తిరిగి ఆ చోట నాయకుడు ఇప్పేరు చెరువు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తోలుతున్నాడు. ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలో చాలా చోట్ల ఇదే తంతు సాగుతోంది. కమర్షియల్ వాడకానికి 500క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అనుమతి ఇస్తారు. రూ. 65వేలు చెల్లించి మట్టిని తరలించాలి. ఇది అధికారికంగా ప్రభుత్వం చెరువులో మట్టికి నిర్ణయించిన ధర అయినప్పటికీ దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

మట్టిమాఫియాకు అధికారులు అండ

జిల్లాలో మట్టిమాఫియా ఆగడాలకు సంబంధిత శాఖల అధికారులే అండగా నిలుస్తుండటం గమనార్హం. మట్టి మాఫియాతో మైనర్ ఇరిగేషన్, భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసులు కుమ్మక్కై ఇష్టారీతిలో మట్టిని తరలించేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉన్నాయి. ఇందుకు ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ముడుపులు పుచ్చుకుని వంత పాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పామిడి మండలం దేవరపల్లి కొండలు, గుట్టలు, కూడేరు మండలం ఇప్పేరు, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో అక్రమంగా మట్టిని తరలించిన ఉందంతాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.


టిప్పర్‌లోకి మట్టిని నింపుతున్న ఎక్స్‌కవేటర్

చర్యలు తీసుకుంటాం



కొండలు, చెరువుల్లో మట్టిని తరలించినట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పేరు, పామిడి మండలాల నుంచి పలు ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై నిఘా ఉంచాం. ఇటీవల పొట్టిచెరువుకు చెందిన ఎక్స్‌కవేటర్, టిప్పర్లను సీజ్ చేశాం. చెరువుల్లో మట్టిని తరలించేందుకు మైనర్ ఇరిగేషన్, మైన్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతి ఉండాలి. కమర్షియల్, ఇతర వాటికి ఫీజు వసూలు చేస్తారు. రైతులకు మాత్రమే ఉచితంగా మట్టిని తరలించుకునే వెసులుబాటు ఉంది. అనుమతికి మించిన మట్టిని తరలించినట్లు తేలితే ఉన్నతాధికారులకు విచారణ నివేదిక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి

దానిమ్మ రైతుకు పరిహారం చెల్లించండి

వ్యవసాయ శాఖకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతుకు పరిహారం చెల్లింపు విషయంలో వ్యవసాయ శాఖాధికారులకు జిల్లా వినియోగదారుల ఫోరంలో మొట్టికాయ వేసింది. బాధిత రైతుకు పంట నష్టం పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనీ, వెంటనే చెల్లించాలని ఆదేశించింది. గుమ్మఘట్ట మండలం గోల్లపల్లికి చెందిన రైతు గౌని రాఘవేంద్ర రెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. అతడికి ప్రభుత్వం ప్రకటించిన పంట బీమా పరిహారంగా రూ.2.61 లక్షలు, రైతు అనుభవించిన మనోవేదనకు గాను మరో రూ.50వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రైతు గౌని రాఘవేంద్రరెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. పంట బీమా జాబితాలో తన పేరున్నా పరిహారం ఎందుకు చెల్లించలేదని అధికారులను సంప్రదించారు. 2022లో స్పందన ద్వారా అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా పంట బీమా పరిహారం మాత్రం అందలేదు. చివరికి 2023లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వ్యవసాయ అధికారులు, ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు. రైతు తన పంట బీమా వివరాలను వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయలేదనీ, అందుకే పరిహారం అందలేదని అధికారులు వాదించారు. అదే భూమిలో ముందుగా గౌని సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి పంట బీమా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2021లోనే అదే భూమిలో భూసార పరీక్ష ఆధారంగా వేరే పంటకు బీమా పరిహారం చెల్లించామని తమ నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు. రైతు తన పంట బీమా నమోదు పూర్తి చేసి, అనేకసార్లు అధికారులను కలిశాడనీ, తగిన చర్యలు తీసుకోలేదని కమిషన్ గుర్తించింది. దానిమ్మ పంటకు బీమా పరిహారం అందిన రైతుల జాబితాలో అతని పేరు ఉన్నా.. పరిహారం ఇవ్వకపోవడానికి తెలిపిన కారణాలు సబబుగా లేవని పేర్కొంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు తీవ్ర ఆర్థిక నష్టం చవిచూశాడని స్పష్టం చేసింది. ప్రతిపాదించిన ఎకరాకు రూ.33,600 పరిహారం హక్కుగా ఉందనీ, మొత్తం 7.78 ఎకరాలకు రూ.2.61 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. రైతు పంట బీమా కోసం చేసిన ప్రయత్నంలో అనుభవించిన మానసిక వేదనను కమిషన్ గుర్తించిందని అందుకు పరిహారంగా మరో రూ.50వేలు వ్యవసాయ శాఖ అధికారులు చెల్లించాలని పేర్కొంది. ఈ మొత్తం 45 రోజుల్లో చెల్లించకపోతే 9శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, మెంబర్ డి గ్రేస్ మేరీతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

రాక్రీట్ అవినీతిని తేల్చండి

తోపు కాజేసిన సొమ్ము రికవరీ చేయండి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


అసెంబ్లీలో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ అవినీతిని నిగ్గు తేల్చాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంస్థ అవినీతిలో భాగస్వాములైన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అక్రమాలపై విజిలెన్స్ విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని అన్నారు. తాను తోపునని చెప్పుకునే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. రాక్రీట్ సంస్థ పేరుతో చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావని అన్నారు. ఆ సంస్థ ద్వారా 50 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇసుక, సిమెంట్, ఇనుము ఇతర వాటిలో వందల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్సార్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లో గృహ నిర్మాణపనుల్లో అనేక అక్రమాలు జరిగాయని అన్నారు. వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించామని గొప్పలు చెబుతున్న ఈ తోపు సంస్థ నిర్మించింది వందల సంఖ్యల్లోనే అని అన్నారు. రాక్రీట్ సంస్థ అవినీతిని గమనించి వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థ నిర్మిస్తున్న 13 వేల ఇళ్లను రద్దు చేసిందని అన్నారు. పునాది నిర్మించాక ఒక్కో ఇంటికి మొదటి విడతగా రూ.60 వేలు చెల్లించాలనే విషయాన్ని పక్కనబెట్టి, ఇళ్లు పూర్తయినట్లు అధికారులు కాగితాల్లో చూపించి రూ.కోట్లల్లో బిల్లులు చెల్లించారని అన్నారు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించకుండా బిల్లులు కాజేశారని, ఒకే పేరుతో పదుల సంఖ్యలో ఇళ్లు తీసుకున్నారని అన్నారు. దీనిపై తాము ముఖ్యమంత్రి చంద్రబాబుకు, గృహ నిర్మాణ శాఖ మంత్రికి ఆధారాలతో ఫిర్యాదు చేశామని, కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిందని అన్నారు. విజిలెన్స్ విచారణను వేగంగా పూర్తి చేయించి, రాక్రీట్ సంస్థ కాజేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ప్రకాష్‌రెడ్డి అక్రమాల మీద హౌసింగ్ అధికారులు ఒక నివేదిక సిద్ధం చేశారని, దాన్ని బయటకు రానివ్వకుండా అధికారం అండతో తొక్కిపెట్టారని అన్నారు. ఆ నివేదికను తీసుకుంటే రాక్రీట్ అక్రమాలు పూర్తిస్థాయిలో బయటకొస్తాయని అన్నారు. ప్రకాష్‌రెడ్డి అక్రమాలు అక్కడితో ఆగ లేదని... ఇళ్లను నిర్మించేందుకు వేరే రాష్ట్రం నుంచి వచ్చిన సబ్ కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా బెదిరించి, వారి కార్మికులను బంధించిన గొప్ప చరిత్ర ఆయనకే దక్కుతుందని విమర్శించారు. లబ్ధిదారుల జాబితా తీసుకుని, వారికి ఇళ్లు దక్కాయా లేదా అని పరిశీలించాలని కోరారు. ఈ అవినీతి అక్రమాల కారణంగా ఆరేళ్లుగా పేదల సొంతింటి కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి, మంత్రికి ఆమె విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి కృష్ణాజలాల బంద్


రెగ్యులేటర్ నుంచి రిజర్వాయర్‌కు చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాలు సరఫరా శనివారంతో ముగియనున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి కోసం శ్రీశైలం జలాశయం నుంచి మిగులు జలాలు 40 టీఎంసీలు హంద్రీనీవా పథకం నుంచి చేరాల్సి వుంది. హంద్రీనీవా అధికారులు తెలిపిన మేరకు.. కృష్ణా జలాలను గత యేడాది ఆగస్టు 8వ తేదీ నుంచి విడుదల చేశారు. హంద్రీనీవా పథకం ఫేజ్-1 మెయిన్ కెనాల్ నుంచి జీడిపల్లి రిజర్వాయరుకు 16.223 టీఎంసీలు తరలించారు. ఈ సీజన్‌లో జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు 11.862 టీఎంసీలు విడుదల చేశారు. పీఏబీఆర్‌కు 2.146 టీఎంసీలు మండలంలోని శీర్పి, బెళుగుప్ప చెరువులకు పంపుహౌస్ నుంచి 0.519 టీఎంసీలు విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయరు నుంచి ఔట్‌ఫ్లో 14.437 టీఎంసీ వెళ్లిందని అధికారులు వెల్లడించారు.

130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాల 130 క్యూసెక్కులు వస్తున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 402 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.526 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్‌లో త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. టెట్‌లో అర్హతసాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, నేటివిటీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులను నగరంలోని బీసీస్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయడం, అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 08554-275575 నంబరులో సంప్రదించాలన్నారు.

హోలీకి ప్రత్యేక రైలు

గుంతకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ నియంత్రణకు గుంతకల్లు మీదుగా బెంగళూరు-కలబురగి మధ్య ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి (నంబర్ 06519) ప్రత్యేక రైలు ఈ నెల 13, 14 తేదీల్లో రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 06520) ఈ నెల 14, 15 తేదీల్లో కలబురగిలో ఉదయం 9-35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా వెళుతుందని తెలియజేశారు.

రేపు విద్యుత్ శాఖ

రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

అనంతపురంరూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా సమావేశం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యూసుఫ్ తెలిపారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10:30గంటలకు సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సెలవు రోజుల్లోనూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాపై సెలవు రోజుల్లోనూ అభ్యంతరాలను స్వీకరిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం, ఆదివారం సెలవు దినాలైనా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ మునిసిపల్, జిల్లాపరిషత్, మండలపరిషత్ యాజమాన్యాల్లో పనిచేసే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పవచ్చునన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామని డీఈఓ పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.8



అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.2,600, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 571 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పునరుద్ధరణ ఎప్పుడో..?

- 4 నెలలుగా మూతపడిన పండమేరు పాత బ్రిడ్జి
- రాకపోకలు బంద్... మరమ్మతుల్లో జాప్యం
- వన్ వే బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు
- భయభ్రాంతులకు లోనవుతున్న ప్రజలు


ఉప్పరపల్లి క్రాస్‌లోని పండమేరు పాత బ్రిడ్జి

అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని ఉప్పరపల్లి క్రాస్‌లో పండమేరు బ్రిడ్జి మూతపడి, రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇది జరిగి నాలుగు గడిచినా, బ్రిడ్జిపై వాహన సంచారానికి మోక్షం కలగడం లేదు. ఫలితంగా కొత్త ఏర్పాటు చేసిన బ్రిడ్జి ఒన్‌వే కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. దీనికితోడు ఉప్పరపల్లి క్రాస్, బ్రిడ్జి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారు లు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రాకపోకలు బంద్

ఉప్పరపల్లి క్రాస్ వద్ద ఉన్న పండమేరు పాత బ్రిడ్జిని 2000-2006 మధ్య నిర్మించినట్లు తెలుస్తోంది. దాదాపు ఇరవై ఏళ్ల కావస్తోంది. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు పండమేరు పో టెత్తింది. వరద నీటి ఉధృతికి పాత బ్రిడ్జి కొంత మేర దెబ్బతిన్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. దీంతో బ్రిడ్జిపై రాకపోకలను పూర్తిగా బంద్ చేశారు. ఆర్టీటీ మైదానం వద్ద కదిరి వైపు నుంచి అనంతపురానికి వచ్చే ప్రధాన రహదారిపై బార్ గేట్లను ఏర్పాటు చేశారు. మొదట్లో ద్విచక్రవాహనాలను అనుమతించలేదు. అయితే కొందరు వాహనదారులు ద్విచక్రవాహనాలు వెళ్లేలా బార్‌గేట్లను కొంత ఓపెన్ చేసుకున్నారు.

భయభ్రాంతుల్లో వాహనదారులు

పాత బ్రిడ్జి మూత పడటంతో బళ్లారి రోడ్డు సర్కిల్ నుంచి పంగల్ రోడ్డు వద్ద వరకు నూతనంగా నిర్మించిన రోడ్డుపై ఇరువైపుల నుంచి రాకపోకలు అనుమతించారు. కొత్త బ్రిడ్జిపై రెండు బస్సులు ఎదురు..ఎదురుగా వచ్చాయంటే మరో వాహనం వెళ్లలేదు. దానిపైనే పోలీసులు వాహనాల రాకపోకలకు అనుమతించారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు, అటుగా ప్రయాణించే వాహనదారులు అంటున్నారు. బ్రిడ్జి మూత పడిన కొన్ని రోజులకే పాలవేరు వీరనాగమ్మ గుడి ఆర్చ్ వద్ద జరిగిన ప్రమాదంలో రాప్తాడుకు చెందిన ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడు నేటికీ కోలుకో లేదు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతుండటం అటూగా ప్రయాణించే వారిని కలవరపెడుతోంది. పాత బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

అనుమతులు రాగానే మరమ్మతులు

వరదల సమయంలో పండమేరు బ్రిడ్జి కొంతమేర దెబ్బతింది. బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో వాహనాల రాకపోకలను బంద్ చేశా. బ్రిడ్జి మరమ్మతులపై ప్రత్యేక బృందం పరిశీలించింది. బ్రిడ్జి బెడింగ్ కింద బేరింగులు దెబ్బతిన్నట్లు తెలిసింది. ఆ మేరకు మరమ్మతులకు అంచనాలు తయారు చేశారు. రూ.కోటి వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసి ఉన్నాతాధికారులకు నివేదించాం. బ్రిడ్జి మరమ్మతుల కోసం ఈ నెలాఖరికి నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతుల పనులు చేపడుతాం.

- సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే



ఆర్టీటీ స్టేడియం వద్ద అడ్డుగా పెట్టిన బారికేడ్లు


తరచూ ప్రమాదాలు జరిగే ఉప్పరపల్లి క్రాస్

న్యూస్ బాక్స్

విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న తిమ్మాపురం గ్రామస్థులు

రామగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నూతనగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. ఉదయం గణపతి పూజ, గంగపూజ, గోపూజ, గురుప్రార్థన, యోగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, గ్రామస్థులు, సమీప గ్రామస్థులు పాల్గొన్నారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఘనంగా ఎర్రితాత పరుష

రాప్తాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్య వారి పల్లిలో ఎర్రితాతస్వామి పరుష సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. శనివారం ఉదయం ఆలయం వద్ద రాతిదూలం లాగుడు పోటీలు, సాయంత్రం ఉట్లమాను పరుష, అన్నదానం ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటికుంటలతో భూగర్భ జలాల పెరుగుదల

● డ్వామా పీడీ సలీం బాషా

శింగనమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఫారం పాండ్లు తవ్వడం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని డ్వామా పీడీ సలీంబాష పెర్కొన్నారు. మండలంలోని పెరవలి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారం పాండ్ల తవ్వకం పనులను ఆయన శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడారు. అలాగే ఫారంపాండ్ల వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగామన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ఎరా స్కూల్ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి

అనంతపురంరూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సిల్వర్ జోన్ ఒలింపియాడ్ పరీక్షల్లో రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనిబరిచారు. సైన్స్ సబ్జెక్టులో 27మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. ఇందులో ఏడుగురు స్వర్ణం, 16 మంది రజతం, నలుగురు కాంస్య పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల ఫౌండర్ చిరంజీవిరెడ్డి, చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మాధవరాజు (ఫైల్)

రాప్తాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లికి చెందిన బోయ మాధవరాజు (44) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రాప్తాడు సీఐ శ్రీ హర్ష తెలిపారు. బండమీదపల్లికి చెందిన బోయ మాదవరాజు మూగవాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా, కూలీ పని, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యక్తిగత పని నిమిత్తం గురువారం బండమీదపల్లి నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. పని పూర్తయిన తరువాత స్వగ్రామానికి తిరిగివస్తుండగా 44వ జాతీయ రహదారిపై రాప్తాడు సమీపంలో పండమేరు బ్రిడ్జి వద్ద అనంతపురం నుంచి బెంగళూరు వైపు వెళుతున్న ఏపీ396వై 1440 నంబరు ఉన్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో మాధవరాజు తలకు బలంగా దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. అతడిని అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును రాప్తాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాధవరాజు మృతదేహానికి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టర్ నిర్వహించారు. మాధవరాజుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు మాధవరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలపరిధిలోని గుడ్డాలపల్లికి చెందిన నల్లపరెడ్డి గార్లదిన్నెకు వెళ్లేందుకు కనుం పల్లి వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో పామిడికి చెందిన రాజారమేష్ ద్విచక్ర వాహనంలో పామిడి నుంచి అనంతపురం వెళుతూ.... నలపరెడ్డిని ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎక్సైజ్ పోలీసులు 732 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సమీపంలోని బీజేపీ కొట్టాల వద్ద ఆటోలో నుంచి ద్విచక్రవాహనంలోకి మార్చి రవాణా చేసే సమయంలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకున్నారు. 732 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, కృష్ణారెడ్డి, జాకీర్ హుస్సేన్, జయనరసింహ, హెచ్‌సీలు, పీసీలు పాల్గొన్నారు.

నాటుసారాను పూర్తిగా నిషేధిద్దాం

రామగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాటు సారాను పూర్తిగా నిషేధిద్దామని తహసీల్దార్ జమవుల్లాఖాన్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్‌శాఖ పోలీసులతో కలిసి నవోదయం 2.0 ఎక్సైజ్ శాఖ సంకల్పానికి సంబంధించి కరపత్రాలు, ఫ్లెక్సీలను విడుదలచేశారు. నాటుసారా వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. నాటుసారా అమ్మడం, తయారుచేయడం, రవాణా చేయడం తదితర వాటిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎక్సైజ్ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు నమ్మొద్దు: ఆలం

అనంతపురం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం విషయంపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామిని త్వరలోనే నెరవేర్చడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలో ఆయా జిల్లాల మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబుఇచ్చిన హామిని వక్రీకరించి, వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మే పరిస్థితుల్లోమహిళలు లేరన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న

గార్లదిన్నె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారందరూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న పిలుపునిచ్చారు. గార్లదిన్నెలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామాంజినేయులుతో కలసి కడియాల కొండన్న నాయీ బ్రాహ్మణుల సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వకర్మ పథకం లబ్ధి కోసం అర్హులైన వారు ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం కడియాల కొండన్నను గార్లదిన్నె నాయీ బ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. నాయీ బ్రాహ్మణులు ఎల్లప్ప, రామాంజి, నాగేంద్ర, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరివ్వండి : చిన్నప్పయాదవ్

శింగనమల, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ చివరి ఆయకట్టులోని సలకం చెరువు వరకు సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని సలకం చెరువు గ్రామంలో శుక్రవారం పార్టీ సమావేశం ఏర్పాటు చేసి, గ్రామ నూతన కమిటీని ఎంపిక చేశారు. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ చివరి ఆయకట్టులోని సలకంచెరువుకు నీరు చేరక ఏళ్లు గడుస్తోందన్నారు. పాలకులు ఇప్పటికైనా సలకంచెరువు చెరువులో నీరు చేసి నిల్వ ఉంచాలని కోరారు. నాయకులు మధుయాదవ్, నేసే మధు తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు చూపి వాహనాలను తీసుకెళ్లండి : డీఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో సీజ్ చేసిన వాహనాలను సరైన పత్రాలు సమర్పించి తీసుకెళ్లాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో ఈ తరహా 111 వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో ఉంచామన్నారు. అనంతపురం రూరల్‌లో 33 బైక్‌లు, ఒక ఆటో, రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో 25బైక్‌లు, 4ఆటోలు, టాటా ఏస్, కారు, ఇటుకలపల్లిలో 9 బైక్‌లు, ఆటో, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో 1 బైక్, గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో 10 బైక్‌లు, నార్పలలో 10 బైక్‌లు, బుక్కరాయసముద్రంలో 1 టాటా సఫారి, యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో ఒక బైక్ ఉందన్నారు. వారం రోజుల్లో తీసుకెళ్లకపోతే వేలం వేస్తామని స్పష్టం చేశారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి: ఎంపీ


జనరిక్ మందులను పరిశీలిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం టౌన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : తక్కువధరకే నాణ్యమైన మందులు ప్రజలకు అందించాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాని జన ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపీ అంబికా లక్ష్మీ నారా యణ పేర్కొన్నారు. జిల్లా కేం ద్రంలోని రెండో రోడ్డులో ఉన్న జన ఔషధ మందుల దుకాణంలో జన ఔషధ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై, షాపులో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జన ఔషధ దుకాణాల్లో అతి తక్కువ ధరకు బ్రాండెడ్ మందులు దొరుకుతాయని, వీటిపై వైద్యశాఖ. డ్రగ్స్‌శాఖలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, అదే స్ఫూర్తితో వైద్యవర్గాలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, డ్రగ్స్‌శాఖ ఏడీ రమేష్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ విజయలక్ష్మి ఆత్మహత్య కేసులో ప్రియుడు క్రిష్ణ నరేంద్రను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన ఉప్పర శివయ్యకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. రెండో కుమార్తె ఉప్పర విజయలక్ష్మి రామచంద్రగర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటోంది. ఏడేళ్ల నుంచి విజయలక్ష్మి, నార్పల మండలం నల్లపురెడ్డిపల్లికి చెందిన నార్పల గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తున్న క్రిష్ణ నరేంద్ర ప్రేమించుకుంటున్నారు. తాజాగా అతడు పెళ్లి చేసుకోనని, ఏం చేసుకుంటావో చేసుకో అన్నాడని...ఆ బాధ భరించలేక విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఉప్పర శివయ్య త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని నలంద కళాశాల ఎదుట క్రిష్ణ నరేంద్రను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

యోగా, వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్ మార్చి7(ఆంధ్రజ్యోతి): డీఎఫ్ఓ విఘ్నేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అటవీ శాఖ సిబ్బందికి యోగాపై, వన్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన చట్టాలపై శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ శిక్షణ స్థానిక పంపనూరులోని నగరవనంలో ఉన్న సమావేశ భవనంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. యోగాతో ఎంతటి ఒత్తిడిని అయినా జయించవచ్చని యోగా శిక్షకులు బాబురావు పేర్కొన్నారు. అదే విదంగా వన్యపాణుల సంరక్షణకు ఉన్న చట్టాలను పూర్తి స్థాయిలో అమలుచేసి వాటి సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి, జగన్నాథ్, పలువురు బీట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


జడ్పీలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు


వైద్య కళాశాలలో సీనియర్ మహిళా డాక్టర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మస్థైర్యంతో అడుగు ముందుకేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య కేక్ కట్ చేసి, ఉద్యోగులకు పంచిపెట్టారు. ఏవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్: సమాజంలోని అవకాశాలను అందుకుని ఆదర్శవంతంగా నిలవాలని మహిళలకు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పిలుపునిచ్చారు. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా వేడుకలకు వీసీ అనిత, డీఎం హెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. 'పుస్తకం-4' ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం వీసీ అనితను ప్రొఫెసర్ శోభలత, డాక్టర్ లలిత, కల్పన తదితరులు సన్మానించారు.



ఎస్కేయూ వీసీ అనితను సన్మానిస్తున్న దృశ్యం

● అనంతపురం టౌన్ : జిల్లా వైద్య కళాశాలలో మహిళాదినోత్సవం కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాల రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కేక్‌కట్ చేశారు. సీనియర్ మహిళా డాక్టర్లను సత్కరించారు. వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్‌సోనియా, సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెటిక్ట్ కోయిలో తదితరులు పాల్గొన్నారు. డాక్టర్లు నిహారిక, పరిణితసాయి ప్రదర్శించిన లఘునాటిక మహిళా ఉద్యోగులను కంటనీరు పెట్టించింది.

● రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా అధికారులకు పలు రకాల క్రీడా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ సాకే తిరుపాలు, ఈఓఆర్డి ఆనంద్‌ప్రసాద్, ఎంఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌డీ సూపర్వైజర్ నాగరత్న ఆధ్వర్యంలో రాప్తాడులో ర్యాలీ నిర్వహించారు.


రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కాశీవిశ్వేశ్వరాలయ ఈఓగా శోభ

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా శోభ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం పెన్నహోబిళం నరసింహస్వామి ఆలయ ఈఓ రమేష్‌బాబు కాశీవిశ్వేశ్వరాలయానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనను పెన్నహోబిళానికే పరిమితం చేస్తూ, గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఈఓగా ఉన్న శోభను కాశీవిశ్వేశ్వరాలయం రెగ్యులర్ ఈఓగా బదిలీ చేశారు. కాగా రమేష్‌బాబు రిలీవ్ అయిన అనంతరం శోభ బాధ్యతలు చేపట్టనున్నారు.

పీఆర్ పీఐయూ ఈఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): పీఆర్ పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లి మెంటేషన్ యూనిట్) అనంతపురం డివిజన్ ఈఈగా బాలసుబ్బారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీ సమగ్రశిక్ష విభాగంలో పని చేస్తున్న ఆయనను ఖాళీగా ఉన్న అనంతపురం పీఐయూ ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. ఆయన పీఆర్ పీఐయూ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. డీఈ భరత్ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి నూతన ఈఈకి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మహిళా ప్రజాప్రతినిధులు


నారా లోకేశ్‌తో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, శ్రావణిశ్రీ

అనంతపురం అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్‌ను ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఇతర జిల్లాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి నారా లోకేశ్‌ను కలిశారు. వారితో ఆయన ఫొటో దిగారు. మహిళా ప్రజాప్రతినిధులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

హిందువులపై దాడులు సహించం: వీహెచ్‌పీ

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఇకపై సహించబోమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాళంకి వెంకట రత్నమయ్య పేర్కొన్నారు. వీహెచ్‌పీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 4న రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో హిందువులపై అన్యమతస్థుల దాడి హిందూ మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. ఈ సందర్భంగా హిందువులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. హిందువులందరూ ఐక్యంగా ఉండి హైందవ సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రమణబాబు, సహాయ కార్యదర్శి కిషోర్‌కుమార్‌నాయుడు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై ప్రస్తావించడం అభినందనీయం

● సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలో దశాబ్దాల తరబడి చెత్తాచెదారంతో పేరుకుపోయిన డంపింగ్ యార్డు సమస్యపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడం అభినందనీయమని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో గతంలో అనేక ఆందోళనలు చేశామన్నారు. సీపీఎంతో పాటు టీడీపీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, వైసీపీ, ప్రజాసంఘాల నాయకులు, లెక్చరర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారన్నారు. ఇప్పటికే ఆలస్యమైందని, వెంటనే తరలించాలని కోరారు.

24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

● సాయినగర్ ఎస్‌బీఐ ఎదుట సన్నాహక నిరసన


సాయినగర్ ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన ఖాళీల భర్తీ చేపట్టాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 24, 25 తేదీలలో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక సాయినగర్‌లోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట సన్నాహక నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. పలు డిమాండ్లపై దేశ వ్యాప్తంగా సమారు 10లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు భాగస్వామ్యంతో ఈనెల 24, 25 తేదీలలో చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు ఖాదర్‌భాషా, చంద్రమో హన్, రాఘురామ్ యాదవ్, చంద్రశేఖర్, నరేంద్ర, మారుతి, నటరాజ్, జయకృష్ణ, షాజహాన్‌బాబు, రమేష్, మహేంద్ర, జీఎల్ఎన్ రెడ్డి, గౌస్‌ఖాన్, అనూషా, నీలిమ, భారతి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సవీరాలో మరో అరుదైన ఆపరేషన్

అనంతపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న కిమ్స్‌సవీరా ఆస్పత్రి డాక్టర్లు మరో అరుదైన ఆపరేషన్‌ను విజయవంతం చేసి ఓ యువకుడి ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆ ఆస్పత్రికి చెందిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాల జిస్ట్ డాక్టర్ మహమ్మద్‌షాహీద్ వెల్లడించారు. హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ 23 ఏళ్ల యువకుడు తీవ్రమైన నొప్పితో బాధపడుతుండగా, చికిత్స కోసం సవీరా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ పరీక్షించిన డాక్టర్లు పాంక్రియాస్ నిండా రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్‌కు కుటుంబ సభ్యులు అంగీకరించారు. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి అందులో ఉన్న రాళ్లన్నింటిని తొలగించారు. ఇపుడు అతడు ఆరోగ్యంగా కోలుకుని డిశ్చార్ అయ్యాడు.

10న మండల సర్వసభ్య సమావేశం

రామగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏ ఎన్నికైనా గెలుపు కూటమిదే కావాలి

గుంతకల్లు, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఇకపై వచ్చే ఎన్నికలు ఏవైనా.. అన్నింటిలోనూ కూటమి పార్టీలే జయకేతనాన్ని ఎగురవేసేలా కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి సూచించారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం టీడీపీ కుటుంబ సాధికారిక సారథుల నియామకంపై సమావేశం జరిగింది. ఇందులో నారాయణ స్వామి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు విజయం సాధించేలా టీడీపీ ప్రణాళికను రూపొందించిందన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతి 30 ఓటర్లకు ఓ టీడీపీ కుటుంబ సాధికార సారథిని నియమించడానికి పార్టీ అధిష్టానం సంకల్పించిందన్నారు. వీరు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్లకు చేరువ కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, హనుమంతు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

బెళుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఉదయం చేపలు పట్టేందుకు రిజర్వాయర్లోకి వెళ్లిన వారికి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ట్రైనీ డీఎస్పీ అర్షద్ అలీ, ఎస్ఐ శివ తమ సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయసు 55 ఏళ్లు ఉంటాయని ఎస్ఐ తెలిపారు. వీఆర్వో ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోండి: టీడీపీ

కణేకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తమపై దాడులకు యత్నిస్తున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని బెణెకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రమేష్, ఎర్రిస్వామి కోరారు. గ్రామంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన వన్నూరుస్వామి అనే వ్యక్తి వైసీపీ నాయకుల సహకారంతో గత ఐదేళ్లుగా గ్రామంలో విచ్చలవిడిగా కర్ణాటక మద్యంను విక్రయిస్తున్నాడన్నారు. ఇప్పటికీ అలాగే విక్రయిస్తుండడంతో రెండు రోజుల క్రితం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారన్నారు. తామే పట్టించామన్న ఆరోపణలతో ఆ మద్యం విక్రయదారుడు, వైసీపీ నాయకులు కలిసి తమపై దాడులకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కొంతమంది అధికారులు కూడా కర్ణాటక మద్యం సమాచారాన్ని ఎవరైతే అందిస్తారో వారి పేర్లను పట్టుబడిన వారి వద్ద బహిర్గత పరుస్తూ గ్రామాలలో కక్షలకు తెర లేపుతున్నారని మండిపడ్డారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు వైసీపీ నాయకులు ఆగడాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

జగన్‌ను విమర్శిస్తే సహించం: వైసీపీ

గుంతకల్లు టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత జనసేన నాయకులకు లేదని వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్ పేర్కొన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌కు ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో రికార్డు సాధించారన్నారు. గతంలో పవన్ కల్యాణ్ రెండు చోట్ల అసెంబ్లీకి పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాలేదని విమర్శించారు. జనసేన నేత వాసిగిరి మణికంఠ జగన్ గురించి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై మాట్లాడేందుకే అసెంబ్లీలో జగన్ ప్రతిపక్ష హోదా అడిగారని అన్నారు. ఇకపై జగన్‌ను విమరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీరేష్, కౌన్సిలర్ లింగన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

కళ్యాణదుర్గంరూరల్/డీ హరేహాళ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ముగ్గురు వ్యక్తులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన కుళ్లాయప్ప (51) తన కుమార్తెను బత్తలపల్లిలో వదిలి తిరిగి తన గ్రామం వచ్చి బస్సు దిగి రోడ్డు దాటుతుండగా.. ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీ కొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ అంబులెన్స్‌ను వదిలేసి పరారు కావడంతో.. స్థానికులు అదే అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ కుళ్లాయప్ప మృతి చెందారు. మృతుడికి భార్య వరలక్ష్మి, నలుగురు కుమార్తెలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుళ్లాయప్ప మృతదేహాన్ని టీడీపీ నేత ధర్మతేజ సందర్శించి నివాళులర్పించారు. అలాగే అతడి కుటుంబసభ్యులను ఓదార్చారు. అదేవిధంగా మంగళకుంట గ్రామానికి చెందిన పెద్ద మల్లయ్య (82) రోడ్డు పక్కన వాకర్ సాయంతో నడుస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య హోసూరమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. ఇక డీ.హరేహాళ్ మండలంలోని గొడిశలపల్లికి చెందిన యువకుడు ఉమేష్(28) గతనెల 27వ తేదీ రాత్రి 8గంటల సమయంలో బాదనహాళ్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. దొడఘట్ట గ్రామ సమీపంలోకి రాగానే బైక్‌ను బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

టీడీపీలోకి చేరిక

గుంతకల్లు, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాము టీడీపీలోకి చేరారు. పట్టణంలో శుక్రవారం ఆయన పార్టీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నారాయణ స్వామి పసుపు కండువా వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

● పలుచోట్ల ర్యాలీలు, మానవహారాల నిర్వహణ



తాడిపత్రిలో విద్యార్థినుల మానవహారం

రాయదుర్గంరూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు రాణి రుద్రమదేవి, సావిత్రిబాయిపూలే, కిరణ్‌బేడీ మొదలైన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని సూ చించారు. ప్రతి మహిళకు విద్య చాలా అవసరమని అన్నారు. కనుక బాలికలను చదివించాలని సూచించారు. ఎంఈఓ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని తెలిపారు. తర్వాత ఎన్‌సీసీ కేడెట్లు మహిళ సాధికారతను ప్రతిబింబించే ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, దొడ్డ నాగప్ప, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్యురాలు హిమబిందుకు కళాశాల యాజమాన్యం ఘన సన్మానం చేసింది. అలాగే వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, పూర్వవిద్యార్థిని సబిత, కేజీబీవీ ప్రిన్సిపాల్ మహబూబాబేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని నినాదాలు చేశారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో ఈఓపీఆర్డీ శశికళ, మహిళా ఉపాధ్యాయులు కేక్‌కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాఠశాల మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సంఘ సంస్కర్త అహల్యాబాయి చిత్రపటానికి అర్బన్ ప్రైమరీ మెడికల్ ఆఫీసర్ అయేషా అంజుమ్, కళాశాల డైరెక్టర్ శ్రీవాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

తాడిపత్రి: పట్టణంలోని సాయిచైతన్య, నారాయణ , సాయితేజ పాఠశాలల విద్యార్థినులు ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం అశోక్‌పిల్లర్ సమీపంలో మానవహారంగా ఏర్పడ్డారు. హెచ్‌ఎంలు శ్రీనరసింహ, అమర్‌నాథ్, శివ, ఆర్టీటీ సీఓ ఆంజనేయులు, క్రికెట్ కోచ్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు: జేసీపీఆర్



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీపీఆర్

యాడికి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ఆయన బ్రహ్మోత్సవాల నిర్వహణ పర్యవేక్షకులతో సమావేశమై మాట్లాడారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని, తాగునీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించాలని తెలిపారు.

అట్టహాసంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శివలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, కలశస్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులు, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఇందులో పాల్గొనడానికి 30జట్లు తమపేర్లను నమోదు చేసుకున్నాయి. కబడ్డీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పోటీలను తిలకించడానికి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ఈరన్న పోలీసు బందోబస్తు నిర్వహించారు.

గడ్డివాములు దగ్ధం

గుత్తి/ గుత్తిరూరల్‌మార్చి7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో గల జగనన్న కాలనీ సమీపంలో వరి గడ్డివాము శుక్రవారం అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతోనే ఇలా జరిగిందని ఆర్‌ఎస్‌కు చెందిన బాధితుడు నాగభూషణం తెలిపాడు. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన చెందాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పారు. అప్పటికే వామి మొత్తం కాలిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని గొందిపల్లిలో చిన్నఓబులపతి అనే రైతుకు చెందిన వేరుశనగ పొట్టు వామి అగ్నికి ఆహుతైంది. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ తాగి వామికి సమీపంలో పడేయడంతో నిప్పురాజేసుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించే లోపువామి పూర్తిగా దగ్ధమైంది. రూ.70 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

ఆలయంలో చోరీకి యత్నం

కణేకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెంపల్లిలో గల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఒక వ్యక్తి చోరీకి ప్రయత్నించి విఫలమయ్యాడు. గ్రామానికి కొంత దూరంలో ఉన్న ఆలయంలోకి మిట్ట మధ్యాహ్నం గ్రామానికి అతిథిగా వచ్చిన ఓ వ్యక్తి వెళ్లి చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ సంఘటన సీసీకెమెరాలో నమోదైంది.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు సీజ్

పామిడి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంబళ్లపల్లి గ్రామంలో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలించేందుకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను సీఐ యుగంధర్ పట్టుకున్నారు. తంబళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎలాంటి అనుమతులు లేకుండా వంకలోని ఇసుకను ఎక్స్‌కవేటర్, ఐదు ట్రాక్టర్లతో తమ పొలాలకు తరలిస్తుండగా.. పోలీసులు దాడులు చేసి వాటిని సీజ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

భీమునిపల్లిలో ఘర్షణ

పెద్దవడుగూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమునిపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకున్నారు. గ్రామంలో రంగయ్య అనేవ్యక్తి అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామికి రూ.60వేలను గతేడాది అప్పుగా ఇచ్చాడు. కాగా ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని రంగయ్య శుక్రవారం అడగ్గా.. ఎర్రిస్వామి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

ఉపాధి పనుల్లో రూ.4.5 లక్షల అవినీతి

గుమ్మఘట్ట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఏడాది పాటు జరిగిన ఉపాధిహామీ పనుల్లో రూ. 4.5 లక్షల దాకా అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ ప్రజావేదిక నిర్వహించి ఉపాధి పనులపై చేపట్టిన తనిఖీల వివరాలను వెల్లడించారు. ఎస్ఆర్పీ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం వివరాలు వెల్లడించారు. కార్యక్రమానికి ప్రొసీడింగ్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణుడు, ఏపీఓ సురేష్ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి దాకా పంచాయతీరాజ్, ఉపాధిహామీ నిధులతో దాదాపు రూ. 14.94 కోట్లు వెచ్చించి 810 పనులు చేపట్టారు. వాటిపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేసి రూ.4.5 లక్షలు అవినీతి జరిగినట్లు తేల్చారు. వీటిలో 19 వేలు రికవరీ చేయగా రూ.18 వేలు జరిమానా విధించారు. మరో రూ. నాలుగు లక్షల నిధులకు సంబంధించి పనులను రెక్టిఫికేషన్ చేసుకోవాల్సిందిగా ఉపాధిహామీ ఉన్నతాధికారులు సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ సిబ్బంది మినహా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు.

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బోరంపల్లి వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా ఏర్పాటైంది. ఇందులో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు 46 మంది అభ్యర్థులు హాజరు కాగా 20 మందిని కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

శ్రీవాణి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

తాడిపత్రి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్‌లోగల శ్రీవాణిస్మార్ట్ స్కూల్‌లో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు నాగరాజు, రామగోవిందరెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన 175నమూనాలను తిలకించి వారిని అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరించిన విద్యార్థులను శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ గంగాధర్ అభినందించారు. నమూనా ప్రదర్శనలో తాడిపత్రి మున్సిపాలిటీ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కార్తీక్ , ప్రిన్సిపాల్ బాలస్వామి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు బాలిక..

పుట్లూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గనపల్లె గ్రామానికి చెందిన నాగమణి కుమార్తె నాగచరిత అనే 10ఏళ్ల బాలిక రెండురోజులక్రితం తప్పిపోయింది. దీంతో అక్కడ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయగా పుట్లూరు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో విచారణ చేపట్టి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో బాలిక ఉన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. వెంటనే తల్లిని పిలిపించి బాలికను అప్పగించామని హెడ్‌కానిస్టేబుల్ మధు తెలిపారు. మహిళా పోలీసు సరళాదేవి పాల్గొన్నారు.

ఐరావతంపై చంద్రమౌళీశ్వరుడు



ఐరావత వాహనంపై స్వామివారు

ఉరవకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐరావతవాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ఐరావతవాహనంపై కొలువుదీర్చారు. మఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ భారీ భక్తజనం మధ్యన ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణ్‌స్వామి, గవిమఠం సహాయకమిషనర్ రాణి, గవిమఠం ఏజెంటు రాజన్నగౌడ్, వీరశైవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అడ్డపల్లకీ ఉత్సవం

గవిమఠంస్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అడ్డపల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న మఠం నుంచి పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామికి స్వాగతం పలుకుతూ పల్లకిలో వీధుల గుండా ఊరేగించారు. అనంతరం మఠంలో పీఠాధిపతికి పాదపూజ చేశారు. గవిమఠం సహాయకమిషనర్ రాణి పీఠాధిపతికి గండపేరండం తొడిగారు. అనంతరం పట్టణంలోని వీధుల గుండా అడ్డపల్లకి ఉత్సవం కొనసాగింది. కోలాటాలు, విన్యాసాలు, కళాకారుల తాండవాలు, వేషధారణ నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అడ్డపల్లకి ఉత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పీఠాధిపతిని దర్శించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి

గవి మఠం ఉత్సవాల్లో గజలక్ష్మి (ఏనుగు)ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి వినతి మేరకు 1998లో కర్ణాటక ప్రభుత్వం ఈ ఏనుగును మఠానికి కేటాయించింది. 27 ఏళ్ల నుంచి మఠం ఉత్సవాల్లో ఈ ఏనుగు పాల్గొంటోంది. ఉత్సవాలు ప్రారంభం నుంచి గజలక్ష్మిని ముందు ఉంచడం అనవాయితీగా వస్తోంది.

బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

గుంతకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగ సంఘాల డిమాండ్లను నెరవేర్చాలని లేదంటే ఉద్యమం ఉధృతమౌతుందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట శుక్రవారం సాయంత్రం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్యాంకుల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీచేసి పని ఒత్తిడిని తగ్గించాలని, బ్యాంకుల్లో ఐదు రోజుల పనివిధానాన్ని అమలుచేయాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని విడనాడాలని, ఉద్యోగుల ఇతర డిమాండ్లన్నింటినీ ఆమోదించాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



పాదయాత్రలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

ఉరవకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గిట్టుబాటు ధరల కోసం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉరవకొండ నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకూ పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర చిన్నముష్టూరు, కోనాపురం, పెన్నహోబిలం మీదుగా సాగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తే వాటికి గిట్టుబాటు ధరలు లేవన్నారు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కు తోచక రైతులు రోడ్డున పడుతున్నారన్నారు. ఖరీఫ్, రబీలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలన్నారు. మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి క్వింటాలు రూ. 50వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా క్వింటా పత్తి రూ.10వేలతో కొనుగోలు చేయాలన్నారు. ఈ డిమాండ్లతో 10వతేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాంభూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సహాయ కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం

● ఉదయం 11 గంటలైనా హాజరుకాని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

శెట్టూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయమైనా ఏ ఒక్క అధికారి విధులకు హాజరు కాలేదు. వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు అధికారుల కోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాశారు. ప్రతిరోజూ ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని, 11 గంటల వరకూ అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో ఎదురుచూపులు చూస్తున్నామని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ అధికారులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



కార్యాలయంలో 11 గంటలైనా ఖాళీగా ఉన్న కుర్చీలు

ఇంకా జగన్ ఫొటో ఏంటి?

● ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్డుపై మాజీ సీఎం ఫొటో
● ఆగ్రహించిన తెలుగు తమ్ముళ్లు



జగన్ ఫొటో ఉన్న కార్డు

కూడేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పంపిణీ చేసిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్డులో అప్పటి సీఎం జగన్ ఫొటోఉన్న కార్డులనే వైద్య సిబ్బంది కొనసాగిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన తెలుగు తమ్ముళ్లు ఆ కార్డులను ఇంకెంత కాలం కొనసాగిస్తారంటూ వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని సచివాలయం-2లో 104 సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించేందుకు క్యాంపు ఏర్పాటు చేశారు. రోగులతోపాటు వైద్య సిబ్బంది వద్ద జగన్ ఫొటోలు ఉన్న కార్డులు కనిపించడంతో ఉదిరిపికొండకు చెందిన టీడీపీ నాయకులు వీరుపాక్షి , వీరభద్ర ఆరా తీశారు. ప్రభుత్వం మారినా జగన్ ఫొటోలతో కార్డులు కనిపించడంతో వారు అవాక్కయ్యారు. కార్డులపై జగన్ ఫొటోలు ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక వైద్య సిబ్బంది నీళ్లు నమిలారు. ప్రభుత్వ కార్డులపై జగన్ ఫొటోలున్న చోట స్టిక్కర్లు అతికిస్తామని సూపర్‌వైజర్ రవీంద్ర తెలిపారు.